

బంగాళాఖాతంలో అల్పపీడనం.. విస్తారంగా వర్షాలు..

వివరాలు 8లో..



తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జీవీఎంసీ సంసిద్ధం

వివరాలు 8లో..



# ఋషికొండలో పవన్‌కల్యాణ్ భవనాల పరిశీలన

విశాఖపట్నం, అక్టోబర్, 21, ప్రభాతవార్త

గత ప్రభుత్వం హయాంలో నిర్మించిన ఋషికొండలో పర్యాటక భవనాల ను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ,ఎంపీ శ్రీభరత్ తో కలిసి పర్యటించారు. . ఈ సందర్భంగా, వారు బయట ఉద్యానవన పనులు చేస్తున్న మహిళా కార్మికులతో కాసేపు మాట్లాడి, వారి కష్టాలను గురించి తెలుసుకున్నారు. అనంతరం పవన్ కళ్యాణ్ రుషికొండ భవనాలపై జరుగుతున్న న్యాయ పోరాటం అంశంపై ఎంపీ శ్రీభరత్ నుండి వివరణలు కోరారు. ఎన్ జి టి నియమాలకు విరుద్ధంగా గత ప్రభుత్వంలో కట్టిన ఈ ప్యాలస్ ప్రస్తుతం పూర్తి నిరుపయోగంగా ఉంది అని, ఈ ప్యాలస్ ను రానున్న రోజుల్లో అందరికీ ఉపయోగపడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అని ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు..







## రాష్ట్ర ఉపముఖ్యమంత్రికి విశాఖలో ఘన స్వాగతం

పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికిన ప్రజా ప్రతినిధులు, అధికారులు

- మిగతా 8 లో..





## పోలీస్ అమరవీరుల త్యాగఫలితమే.. శాంతి, సౌభ్రాతృత్వం

అమరుల త్యాగాలు అజరామరం
విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

8 లో







## ఉత్తరాంధ్ర వైయస్ఆర్‌సీపీకి పూర్వ వైభవం

బెందాళం పద్మావతి

- మిగతా 8లో..



## సమస్యల పరిష్కారంపై.. ప్రజల్లో నమ్మకం కలిగించాలి

భరోసా కల్పించడానికే గ్రీవెన్స్‌లో నేనూ పాల్గొంటున్నా

భీమిలి ఎమ్మెల్యే గంటా

8 లో..

## జగన్.. నీకు దమ్ముంటే.. అసెంబ్లీకి రా..

అనకాపల్లి, అక్టోబర్, 21, ప్రభాతవార్త

వైసీపీ ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి దమ్ముంటే అసెంబ్లీకి రావాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సవాల్ విసిరారు. నాతవరం మండలం, పెద గొలుగొండ గ్రామంలో జరిగిన పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో పాల్గొని సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి గా ప్రజలను మెప్పించలేకపోయిన జగన్ ప్రతిపక్ష పాత్రను కూడా పోషించడంలో విఫలమయ్యారని అన్నారు. అసెంబ్లీలో బలం లేక ఆయన రావడంలేదని అంతా అనుకుంటున్నారని, కానీ అసెంబ్లీలో అడుగుపెడితే స్పీకర్ స్థానంలో ఉన్న నాకు నమస్కారం చేయాల్సి ఉంటుందని రావడం లేదని అన్నారు. స్పీకర్ స్థానంలో కూర్చున్న తనకు ఎమ్మెల్యేలు గౌరవంగా నమస్కారం చేస్తారని అది శాసనసభ విధి విధానాలని అన్నారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు సైతం సభలో అడుగు పెట్టిన వెంటనే నమస్కారం అయ్యన్నపాత్రుడు గారు అంటారని, సభా సంప్రదాయాలకు ఆయన విలువ ఇస్తారని అన్నారు. కానీ జగన్ రెడ్డి మాత్రం నియంతలా దండాలు పెట్టించుకోవడమే తప్ప ఎవరికీ పెట్టరని, ఇపుడు సభలో అడుగు పెట్టిన సభా మర్యాదలు పాటించాలి కనుక తప్పని సరిగా తనకు నమస్కారం చేయాల్సి ఉంటుంది కనుక ఆయన రారని అన్నారు. జగన్ వచ్చి నాకు నమస్కారం చేస్తే ఇద్దరం కలిసి ముచ్చట్లు చెప్పుకోవాలని ఉందని అన్నారు.







## నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

- మిగతా 8లో..



## ఎంవీవీ సంస్థల్లో సోదాలపై ఈడీ ప్రకటన

రూ.200 కోట్ల అవకతవకలపై 5 చోట్ల సోదాలు

8 లో

## వరుధు కళ్యాణి నీ స్థాయి ఏంటి ?

ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు - తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రత్నకుమారి



వివరాలు 8లో..

## ఐఎన్ఎస్‌లో ఆధునీకర ఆసుపత్రి

8 లో





## అనకాపల్లి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తుహిన్ సిన్హా

గంజాయి అక్రమ రవాణా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పటిష్టంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తాం

వివరాలు 8లో..



## ఐటీ హిల్స్‌కు నాలుగు ఆర్టీసి బస్సులు : ప్రారంభించిన గంటా

వివరాలు 8లో..



## బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్

8 లో..

## గ్రామ పంచాయితీలనే సచివాలయాలుగా మార్చండి

### సచివాలయ సిబ్బందిని పంచాయితీలకు అప్పగించండి -సర్పంచులు, ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ఛాంబర్ డిమాండ్ -అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతి



పాడేరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త

ఎంతో సమర్థవంతంగా నడుస్తున్న పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారని పాత పంచాయితీలనే సచివాలయాలుగా మార్చి సచివాలయ సిబ్బందిని పంచాయతీలకు అనుసంధానం చేయాలని సర్పంచులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ డిమాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొర్రా నాగరాజు ఆధ్వర్యంలో జిల్లా సర్పంచులు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కి దీనికి సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవీ బాబు రాజేంద్ర ప్రసాద్ ఆదేశాలు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి, ఉపాధ్యక్షులు బొర్రానాగరాజు పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కోసం ప్రభుత్వాలు పని చేయాలి తప్ప నిర్వీర్యానికి ఏ ప్రభుత్వమూ కృషి చేయకూడదని అందరూ కోరుకునేదన్నారు. కానీ గత వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పక్కనపెట్టి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిందని దానిలో కూడా సంపూర్ణ నిర్మాణం చేపట్లేదని ఆయన ఆవేశన వ్యక్తం చేశారు. సచివాలయంలో పనిచేసే సిబ్బంది బాధ్యతలు ఏమిటో ఎవరి ఆధ్వర్యంలో ఉండాలో ఎవరు పర్యవేక్షించాలో తెలియక అయోమయ పరిస్థితిలో గ్రామ సచివాలయ వ్యవస్థ నడుస్తుందన్నారు. దీనివలన గ్రామాల అభివృద్ధికి కృషి చేసే గ్రామ పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయిందన్నారు. సర్పంచులు ఉత్సవ విగ్రహంలా మారిపోయారని గ్రామ ప్రజల శ్రేయస్సును, అభివృద్ధిని, ఆర్థిక పురోభివృద్ధిని కాంక్షించే పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైపోయిందన్నారు. అందుకే ప్రతి గ్రామ పంచాయతీని ఒక సచివాలయంగా మార్చి సచివాలయ సిబ్బందిని పంచాయతీలకు అనుసం ధానం చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. తమ డిమాండ్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పంచాయతీ వ్యవస్థ బలోపేతం అయ్యేలా కృషి చేయాలని విన్నవిం చినట్లుగా తెలిపారు. దీనికి సంబంధించిన వినతిపత్రాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ అందజేసినట్లుగా పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం త్వరితగతిన స్పందించాలని గ్రామ స్వరాజ్యం దిశగా డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో కొనసాగుతున్న అభివృద్ధి ఫలాలు మరింత దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ పంచాయతీలను సచివాలయాలుగా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాకూరు సర్పంచ్ బాకూరు వెంకటరమణ, దారెల సర్పంచ్ పాండురంగస్వామి, శోభకోట సర్పంచు నాయుడు, తడిగిరి సర్పంచ్ రంజిత్ కుమార్, మఠం సర్పంచ్ శాంతకుమారి, అండిభ సర్పంచ్ సత్యనారాయణ, పాడేరు సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, కిండంగి సర్పంచ్ కూడా శ్రీలక్ష్మి, లగిసపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నాల్గోతరగతి ఉద్యోగులు సమస్యలపై గిరిజన సంక్షేమాధికారికి వినతులు

రాజవొమ్మంగి, అక్టోబరు 21, ప్రభాతవార్త



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పని చేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రంపచోడవరంలో గిరిజన సంక్షేమాధికారిణి విజయశాంతికి వినతిపత్రాన్ని గౌరవ అధ్యక్షులు ఆర్.శివకుమార్ ఆధ్వర్యంలో యూనియన్ అధ్యక్షులు ఎస్.రామన్నదొర, ప్రధాన కార్యదర్శి పి.చిన్నారెడ్డిలు వినతిపత్రాన్ని ఇచ్చారు. రంపచోడవరం, సబ్ ప్లాన్ మండలాల్లో గల ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న కుక్, కమాటీ, వాచ్ మెన్, అటెండర్ల సమస్యలను వివరించారు. వంట గ్యాస్ సరఫరా, వారంలో ఒకరోజు సెలవు, యూనిఫామ్‌లు, సీనియారిటీ జాబితా, ఏ.టి.డబ్ల్యు.ఓ కార్యాలయంలో పనిచేస్తున్న వాచ్‌మెన్, హెల్పర్ పోస్టులను అటెండర్ పోస్టుగా మార్పు చేయాలని కోరారు. సమస్యలపై డి.డి.విజయశాంతి సానుకూలంగా స్పందించారు. ఉన్నతస్థాయి అధికారులు దృష్టికి సమస్యలను తీసుకొని వెళతానని అన్నారు. ఈకార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆర్.శివకుమార్, యూనియన్ అధ్యక్షులు ఎస్.రామన్నదొర, ఉపాధ్యక్షులు తాతాజీ, ప్రధాన కార్యదర్శి పి.చిన్నారెడ్డి, కోశాధికారి పి.నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

## ఎర్రంపాడులో రీసర్వే రెవెన్యూ గ్రామసభ



రాజవొమ్మంగి, అక్టోబరు 21, ప్రభాతవార్త

ఎర్రంపాడు గ్రామంలో సోమవారం రీసర్వే రెవిన్యూ గ్రామసభ సర్పంచ్ చీడి శివ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దారు కె. సూర్యారావు మాట్లాడుతూ భూసర్వేలో తప్పులు ఏవైనా నమోదు అయితే సరి చేసుకోవడానికి ఈ గ్రామసభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. భూసర్వేలో సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చీడి శివ, ఆగూరి సుబ్బలక్ష్మి, వార్డు మెంబర్ మంతెన ముసలయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ చెల్లయ్యమ్మ, విఆర్వో భారతి, సర్వేయర్లు రాంబాబు, శివ, శ్రీధర్, సుభాషిణి, రైతులు పాల్గొన్నారు.

### నేడు చెరుకుంపాలెంలో రీసర్వే రెవెన్యూ గ్రామసభ..

మంగళవారం చెరుకుంపాలెం గ్రామంలో రెవిన్యూ గ్రామసభ జరుగుతుందని మండల తహసీల్దారు కె.సూర్యారావు తెలిపారు. భూములు రీసర్వే, వివరాలు నమోదులో తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు అన్నారు.

## పాడేరులో ఘనంగా శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవరాట మహోత్సవం

పాడేరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త



పాడేరు గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా కార్తీక మాసంలో నిర్వహించే గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు సోమవారం ఉత్సవరాట మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గత 12 సం.గా పాడేరులో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు ఈ సంవత్సరం కూడా దిగ్విజయంగా నిర్వహించేందుకు గౌరీ సేవా సంఘం ప్రతినిధులు, సభ్యులు నిర్ణయించారు. ఈ నెల 30 నుండి నవంబర్ 30వ తేదీ వరకు ఉత్సవాలు సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు, సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం ప్రతినిధులు కొణతాల సతీష్, ఎల్లపు మోహన్, తనకాల సూరిబాబు, కొణతాల ప్రశాంత్, మల్ల పరమేశ్వరరావు, సరసా మధు, బీసెట్టిసాయిరాం, మద్దాల కొండబాబు, దాడి శ్రీను, కనిశెట్టి నాయుడు, చదరం ఈశ్వరరావు, సుబ్రహ్మణ్యం పంతులు, గౌరీ సేవా సంఘం మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాలు



రాజవొమ్మంగి, అక్టోబరు 21, ప్రభాతవార్త

సోమవారం చీడిపాలెం, బూసులపాలెం గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం జరిగింది. లాగరాయి పి.హెచ్.సి డా.నాగార్జున 36 మంది రోగులకు వైద్య పరీక్షలను చేసి మందులను ఇచ్చారు. ఈకార్యక్రమంలో డా.నాగార్జున, ఎం.ఎల్.హెచ్.పి. సుస్మ, హెల్త్ అసిస్టెంట్ మాతిరెడ్డి సోమి నాయుడు, 104 డి.ఇ.ఓ శ్రీనివాస్, పైలట్ శివకనకరాజు, ఆశలు పాల్గొన్నారు.

### నేడు రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాలు..

మంగళవారం పాతవెలగలపాలెం, కొత్త వెలగలపాలెం గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని జడ్డంగి పి.హెచ్.సి డా.యామిని ప్రియ తెలిపారు.

## గతమెంతో ఘనం...నేడు రోడ్డులేని దైన్యం..!

### గాంకొండ గ్రామ గిరిజనుల ఆవేదన

కొయ్యూరు, అక్టోబరు 21, ప్రభాతవార్త



గతం ఎంతో ఘనమైనప్పటికీ, ప్రస్తుతం రోడ్డు కూడా లేని దుస్థితిలో ఉన్నామంటూ, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమ గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని మండలంలోని నడింపాలెం, గాంకొండ గ్రామ గిరిజనులు ప్రాదేపడుతున్నారు. తమ పక్క గ్రామమైన లంక వీధి స్వాతంత్ర సమరయోధులు గాం గంటం దొర, మల్లు దొర స్వగ్రామం కాగా, తమ గ్రామంలో ఆ పోరాట యోధులు నిత్యం నడయాడే వారని, అటువంటి ఘనచరిత్ర గల తమ గ్రామానికి ప్రస్తుతం రోడ్డు లేక గర్భిణీలను, అనారోగ్యంతో ఆసుపత్రికి తరలించడానికి, అలాగే వ్యవసాయానికి అవసరమైన సరుకులను, నిత్యావసరాలను తెచ్చుకోవడానికి, పండించిన పంటలను విక్రయించడానికి రోడ్డు లేక ఎన్నో అవస్థలు పడుతున్నామన్నారు. తమ గ్రామానికి దగ్గరలోని తీగల మెట్ట వరకు నడింపాలెం నుండి రోడ్డు మంజూరు అయిందని, అక్కడనుండి దగ్గరలోని తమ గ్రామానికి కూడా రోడ్డు మంజూరు చేయాలని గ్రామ గిరిజనులు వేడుకుంటున్నారు.



## జలపాతానికి సంకెళ్లు!! ఎన్నాళ్లు ఇలా!!

### నిరుత్సాహంతో వెనుతిరిగి వెళుతున్న పర్యాటకులు!!

మోతుగూడెం, అక్టోబరు 21, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం గ్రామ పంచాయతీ పరిదిలో ఉన్నా పోల్లూరు జలపాతానికి సుమారు రెండు నెలలుగా అటవిశాఖ అధికారులు జలపాతం సందర్శనకు అనుమతించటం లేదు. సుదూర ప్రాంతాలనుండి ప్రతి నిత్యం వస్తున్నా పర్యాటకులు పోల్లూరు జలపాతం వద్దకు వెళ్లే గ్రావెల్ మెటల్ రోడ్డు వద్ద అటవీశాఖ విభాగం వారు ఏర్పాటు చేసిన జలపాతం ఇన్ పాయింట్ వద్ద విదినిర్వహణ చేస్తున్న అటవిసిబ్బంది జలపాతం సందర్శించటానికి అనుమతులు లేవని పర్యాటకులకు తెలపటంతో ఆర్ అండ్ బి రహదారి వద్ద నుండే నిరుత్సవంతో పర్యాటకులు వెనుతిరిగి పరిస్థితిలు నెలకొన్నాయి. ఇటీవలే భారీ నుండి అతిభారీ వర్షాలు కురవటం తో వాగులు వంకలు ప్రమాదస్థాయిలో పొంగి అనేక చోట్ల కొండచరియలు విరిగి పడ్డాయి. అదే సమయంలో ఇతరత్ర కొండవాగుల్లో చివరకు మారేడుమిల్లి జలతరంగిణి వాగులో సైతం పర్యాటకులు గల్లంతై మృత్యు వాతపడిన సంఘటనలు నెలకొన్నాయి. మానవ జీవన మనుగడ భద్రత దృష్ట్యా జిల్లా అధికారిక యంత్రాంగం అప్రమత్తమై తగు జాగ్రత్తలు చర్యల్లో భాగంగా రాత్రివేళల్లో రహదారులు మూసివేశారు. జలపాతాల సందర్శనను నిలిపివేసారు. అధికారుల పనితీరు ఆ సమయంలో అభినందించదగ్గ విషయమే కాని ప్రమాదాల తీవ్రస్థాయి తగ్గుముఖం పట్టిన తరువాత ఇటు పాపి కొండల్లో పర్యాటకులను ఆకర్షిస్తూ లాంచి షికారు విహారయాత్రను పునఃప్రారంభించారు. అదే విధంగా చాపరాయి జలపాతానికి ఎలాంటి ఆంక్షలు ప్రస్తుతం పెట్టకుండా టూరిజం అభివృద్ధికి సహకరించిన అక్కడ సంబంధిత శాఖ అధికారుల స్వాగత ద్వారాలు తెరవటంతో ఆ ప్రదేశాలు కళ కళలాడుతూ సందర్శనలతో పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పర్యాటకానికి పెద్దపీటా వేస్తు అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఒకప్రక్క చెబుతూ దూసుకుపోతు వుంటే!! ఇక్కడ పోల్లూరు జలపాతం సందర్శనకు చెక్ పోస్ట్ గేటు మూసి సంకేళ్లు వేసారా!! అంటు పర్యాటకులు నిరుత్సహంతో నిరసన తెలుపుతు వెను తిరుగుచున్నారు. దసరా సెలవులకు అంతర్రాష్ట్ర సరిహద్దుల నుండి వేలకొలది పర్యాట కులు వందల కిల్లోమీటర్ల నుండి వచ్చి నిరుత్సహంతో వెనుతిరిగి వెళ్లారు. సాధారణ సమయాల్లో సుమారు వారానికి రెండు నుండి మూడు వేల మంది వస్తు వెనుతిరుగుచున్న సందర్భాలు ప్రస్తుతం ఇక్కడ నెలకొన్నాయి. ప్రకృతి వైపరీత్యాలలో ప్రమాదాలను ముందస్తుగా గుర్తించి ఆంక్షలతో ప్రజలను సంరక్షించే బాధ్యత ఎంత ముఖ్యమో!! ఈ అందమైన ప్రకృతిలో పుట్టిన సహజసిద్ధమైన అందాలను సం దర్శించటానికి కూడా పలు కారాణాలు చూపిస్తూ అనుమతులలో ఆంక్షలు పెట్టి సుదీర్ఘ కాలం కాలయా పన చేస్తుపోతే అరకు లంబసింగి వంజంగి మారేడుమిల్లి పాపికొండలు ఇతరత్ర పర్యాటక ప్రదేశాలలో ప్రకృతి ప్రేమికులతో పాటు మానవ జీవన ఆర్థిక వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారే పరిస్థితులకు పర్యాటక రంగ అభివృద్ధి తిరోగమనానికి నాంధి పలినట్లు కాకుండా!! పర్యాటకరంగం అభివృద్ధికి బాటలు వేయాలని పర్యాటకులు కోరుకుంటున్నారు.

## సభ్యత్వం నమోదు కార్యక్రమం విజయంతం చేయండి



ఎటపాక, అక్టోబర్ 21, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్ తెలుగు దేశం పార్టీ కుటుంబ సభ్యులతో బుధవారం మధ్యాహ్నం 1గంటకు చింతూరు గ్రామంలో ప్రజా దర్బారు వేదిక వద్ద సమావేశం కానున్నారు అని మండల అధ్యక్షుడు పుట్టి రమేష్ బాబు సోమవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం పార్టీ మండల, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల, పంచాయతీ, క్లస్టర్, బూత్, యూనిట్, ఇన్చార్జులు, ఎస్సీ సెల్, బిసి సెల్, ఎస్టీ సెల్, సభ్యులు ఇతర అన్ని విభాగాల నాయకులు పాల్గొనవలసిందిగా కోరారు.

## వెలుగు సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి: ఎండిఓ దెందుకూరు సీతారామరాజు

నక్కపల్లి, అక్టోబర్ 21, ప్రభాతవార్త



మండలంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వెలుగు సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎండిఓ దెందుకూరు సీతారామరాజు సూచించారు. సోమవారం మండలంలోని వెలుగు విఓఏలు నెలవారీ సమీక్ష సమావేశం ఏఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీఓ సీతారామరాజు పలు విషయాలు చర్చించి అనంతరం ఆయన మాట్లాడుతూ విఓఏలు అందరూ నిబద్ధతతో పని చేయాలని, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకి చేరవేయడంలో ముఖ్య పాత్ర పోషించాలని, అవినీతికి ఆస్కారం లేకుండా పని చెయ్యాలని చెప్పారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన "ఉల్లాస్"పథకం ద్వారా గ్రామంలో నిరక్షరాస్యులని పంచాయతీకి 20 మంది చొప్పున గుర్తించి వారికి ఒక టీచర్ (వాలంటీర్‌గా చెప్పాలన్నారు రెమ్యూనరేషన్ ఏమి ఉండదు. ఇది భావించాలని అన్నారు. ఎంపిక చేసి వారికి ప్రాథమిక విద్య, ఆర్థిక విద్య, డిజిటల్ విద్యపై శిక్షణ ఇవ్వవలసిన ఉంటుందని అన్నారు. సిసిలు రాజు, అప్పారావు, కోరి, సన్యాసిరావ్, ప్రసాద్, దీవినమ్మ, గీత హాజరయ్యారు.

## ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలి

డుంబ్రిగుడ, రూరల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త



రాష్ట్రవ్యాప్తంగానున్న ఐటీడీఏల్లో వెంటనే పాలకవర్గ సమావేశాలు నిర్వహించి అందులో జీవో నెం.3పై చర్చ చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పి.చిన్నస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరు లతో మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్చించేందుకుగాను ప్రతి మూడు నెలలకోసారి ఐటీడీఏ పాలక వర్గ సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే సంవత్సరాలు గడుస్తున్న పాలకవర్గ సమావేశాలు నిర్వహించడం. ప్రస్తుతం ప్రధానంగా జీవో నెం.3కు చట్టబద్ధత కల్పించే విధంగా పాలకవర్గ సమావేశంలో చర్చించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు. గిరిజన ప్రాంతంలో 1/70 భూ బదలైంపు చట్టానికి వ్యతిరేకంగా గిరిజన నేతలు నిర్మిస్తున్న క్రమకర్తదాలను వెంటనే నిలుపుదల చేయాలని, ఆశ్రమ పాఠశాల వసతిగృహాల్లో హెల్త్ వాలంటీర్లను నియమించా లని ఆయన కోరారు. ఆ పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ టి.సోమేశ్వరరావు, గాసన్న పాల్గొన్నారు.

## వంతెన నిర్మాణ బిల్లులు చెల్లించాలి

డుంబ్రిగుడ, రూరల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త

కితలంగి పంచాయతీ పరిశీల రోడ్డు సంపంగి గెడ్డ వద్ద వంతెన నిర్మించిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని ఆ పంచాయతీ సర్పంచ్ ఒ సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి సుమారు ఏడాది గడుస్తున్న ఇప్పటికీ బిల్లు చెల్లించకపోవడంతో నిర్మాణ పనులు సగం వరకే జరిగాయని చెప్పారు. నిర్మాణం జరిగిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లిస్తే పూర్తిస్థాయిలో వంతెన నిర్మాణం జరుగుతుందని, అధికారులు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆ పంచాయతీ గిరిజనులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## జనసేనలో 30 కుటుంబాలు చేరిక



ఎటపాక, అక్టోబర్ 21, ప్రభాతవార్త

మండల పరిధిలోని కన్నాయిగూడెం పంచాయతీ పరిధిలోని గట్టు గూడెం గ్రామంలో జనసేన పార్టీ యూత్ ప్రెసిడెంట్ కొమ్ము వెంకటేష్ ఉపాధ్యక్షులు గోవింద్ వెంకటల ఆధ్వర్యంలో 30 గిరిజన కుటుంబాలు వైసీపీ నుంచి పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు ఆశయాలు నచ్చి ఈరోజు జనసేన పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఎటపాక మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ వారికి జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలో లోకి ఆహ్వానించడం జరిగింది. అధ్యక్షులు గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు జనసేన పార్టీ అధినేత ఉప ముఖ్య మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు ఆశయాలు వారి నాయకత్వ పట్టిమ మీద నమ్మకంతో పెద్ద ఎత్తున జనసేన పార్టీలోకి చేరుతా ఉన్నారు అని ఒక నీతి నిజాయితీ గల నాయకుడుకు అండగా ఉండాలని ప్రజలంతా భావిస్తున్నారని ఎటపాక మండలంలో జనసేన పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తా ఉన్నామని అన్నారు. కొద్ది కాలంలోనే ఎటపాక మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో జనసేన పార్టీలో చేరికలు ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ యూత్ ప్రెసిడెంట్ కొమ్ము వెంకట్ ఉపాధ్యక్షులు మోల సతీష్ మంద సుబ్రమణ్యం గోవింద వెంకట్ కార్యదర్శులు కుంజా అర్జున్ గల్లా శివకుమార్ దేగల రాఘవ కాకటి శశాంక్ కొమ్ము మహేష్ ఎస్కే సాయి దాసరి మహేష్ నవీన్ మహేష్ పదం శ్రీను గ్రామ పటేల్ పద్దం రాజు పద్దం శ్రీను సరియం కోటేష్ పద్దం రామకృష్ణ పద్దం లక్ష్మినర్స్ పెనుబలి సురేష్ పదం మహేష్ పదం రాములు నాగరాజు పెనుబల్లి వెంకటేష్ పద్దం చంటి పదం రాము అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

## ఇసుకను ఉచితంగా అందించాలని నర్సీపట్నంలో శాంతియుత నిరసన ర్యాలీ



నర్సీపట్నం, అక్టోబర్ 21,ప్రభాతవార్త

నర్సీపట్నం మండలం గబ్బాడ ఇసుక రీచ్‌లో ఇసుకను ఉచితంగా అందించాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. సోమవారం నర్సీపట్నంలో ఇసుకను ఉచితంగా ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సర్సిపట్నం అబీద్ సెంటర్ నుంచి పాల్ ఘాట్ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ గబ్బాడ ఇసుక పాయింట్ నుంచి 7కోట్ల విలువైన ఇసుకను దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. ఉచితంగా ఇసుకంగా చెప్పి ట్రాక్టర్కు రూ.6500 ఎలా వసూలు చేస్తున్నారని చెప్పారు. ఇలా వసూలు చేస్తున్న డబ్బు చంద్రబాబు ట్యాక్స్ కడుతున్నారా లేక అయ్యన్నపాత్రుడు ట్యాక్స్ గా దోచుకుంటున్నారా అని నిలదీశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఇంకా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల కాలం నుంచి ప్రజలకు లభించే ఆర్థిక ప్రయోజనాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడుతో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాజకమల్ ఫౌండేషన్ సేవలు ఎనలేనివి..

నక్కపల్లి, అక్టోబర్ 21, ప్రభాతవార్త

రాజ్ కమల్, వింగ్స్ ఫౌండేషన్ సేవలు ఎనలేనివని ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్. సత్యనారాయణ అన్నారు. సోమ వారం ఎన్.ఎమ్.ఎమ్.ఎస్. పరీక్షలకు హాజరయ్యే ఎనిమిదవ తరగతి విద్యార్థులకు మండలంలో పెదబోదుగల్లం హై స్కూలులో ఆ సంస్థ వ్యవస్థాపకులు ఎర్ర మిల్లి వెంకట జయరాం, కార్యదర్శి జయ ప్రకాష్ చేతులమీదుగా ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా పాఠశాల విద్యార్థులకు ఉచిత సేవలందిస్తున్నామని అన్నారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం, అనాధశరణాలయాలను నిర్వహించడం ఈ సంస్థ తరపున జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కుమారి, ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఫల్గుణరావు, శ్రీదేవి పాల్గొన్నారు.

## మోతుగూడెంలో అమరవీరులకు ఘన నివాళులు

మోతుగూడెం, అక్టోబరు 21, ప్రభాతవార్త



పోలీసు అమర వీరుల దినోత్సవం సంద ర్భంగా మోతుగూడెం ఎస్సై కే.శివనారా యణ, డొంకరాయిలో శివకుమార్ అధ్వ ర్యంలో పోలీసు అమర వీరులకు ఘననివాళులు అర్పించారు. మోతుగూడెం ఎస్సై శివ నారాయణ పోలీసు అమరుల స్మృతి స్థూపం వద్ద స్మృతి పరేడ్‌ను నిర్వహించి గౌరవ వం దనం చేసి పుష్ప గుచ్చులు ఉంచి తన సిబ్బం దితో ఘనంగా నివాళులు అర్పించారు. ఎస్సై మాట్లాడుతూ మాట్లాడుతూ అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ప్రతి ఒక్కరు వారిని స్ఫూర్తిగా తీసుకొని వారి బాటలో నడవాలన్నారు. ముఖ్యఅతిథిగా ఏపి జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు డిఇ బాలకృష్ణ తదితరులు విచ్చేసి అమరులకు ఘననివాళులు అర్పించారు.



## స్టడీ మెటీరియల్ పంపిణీ

నక్కపల్లి, అక్టోబర్ 21, ప్రభాతవార్త

పిఆర్‌టియు ఎస్.రాయవరం మండలంలో గల వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ఎన్.ఎం.ఎం.ఎస్ స్టడీ మెటీరియల్ సమన్వయంతో వింగ్స్ ఫౌండేషన్ వారు ఆర్థిక సహకారంతో అందించారు. వింగ్స్ ఫౌండేషన్ డైరెక్టర్ జయప్రకాష్ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని సమాజనికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఇవి మాత్రమే కాకుండా ప్రభుత్వ పాఠశాల పేద విద్యార్థులు విద్యాపరమైన అవసరాలు ఏవైనప్పటికీ తమ దృష్టికి తీసుకువచ్చినట్లైతే సహాయం చేయడానికి కచ్చితంగా ముందుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఎస్.రాయవరం బృందానికి జయప్రకాష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## నోరూరించే మునగాకు రుచులు.. అబ్బో ఎన్నో ప్రయోజనాలు..!

### అంగన్వాడీ కేంద్రాల్లో ప్రత్యేక పిండి వంటల ప్రదర్శనలు

కొయ్యూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త



మునగాకుతో తయారు చేసిన పదార్థాలు నోటికి ఎంతో రుచికరంగా ఉండడంతో పాటు, శరీరానికి ఎన్నో ప్రయోజనాలను చేకూర్చి పెడుతుం దని సిడిపిఓ విజయకుమారి తెలి పారు. సోమవారం మండలంలోని చింతలపూడి సెక్టార్ లెవెల్ కాకర పాడు అంగన్వాడీ కేంద్ర పరిధిలో సిబి ఈవెంట్ కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్స్ క్రింద ప్రత్యేక ప్రోగ్రాం ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలలు ఏర్పాటు చేశారు. ఈ నెలలో ముఖ్యంగా ప్రతి కేంద్రంలో ఉండే గర్భవతులు, బాలింతలు, లబ్ధి దారులకు ప్రత్యేకించి మునగాకు, కరివేపాకు ఉపయోగాలు, మునగాకు కరివేపాకుతో తయారు చేయగల పదార్థాల గుర్చి వివరించారు. రుచికరమైన నోరూరించే పిండి వంటలు చేయవచ్చునని అంద రికీ వివరిస్తూ కార్యకర్తలతో మునగాకు పొడులు వాటిల్లో రకాలు, మునగాకుతో తయారుచేసిన పిండి పదార్థాలతో కార్యకర్తలతో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. మునగాకు వాడకం వల్ల ఎన్నో జబ్బులు నివా రించవచ్చునని, సర్వరోగ నివారిణిగా మునగాకు, కరివేపాకు ఉపయోగించుకునేలా ధర చెల్లించే ఆకు కూరల కంటే పెరట్లో పండే స్థానికంగా దొరికే మునగాకు ప్రయోజనం తెలిపారు. 23 మంది సెక్టార్ కార్యకర్తలు, నలుగురు సూపర్‌వైజర్‌లు, ఆల్ స్టాఫ్ మెంబెర్స్ సీనియర్ అసిస్టెంట్, డీఈఓ బిపిసి, ఎమ్మెస్కే పాల్గొన్నారు. అలాగే నలుగురు గర్భవతులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు.

## జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో గిరి విద్యార్థులు ఎంపిక



డుంబ్రిగుడ, రూరల్, అక్టోబర్ 21, ప్రభాతవార్త

అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చందుకుంటున్న గిరి విద్యార్థులు 33వ జాతీయ జూనియర్ రకుల్ ప్రీత్ ఛాంపియన్షిప్ ఈనెల 25 నుంచి 29 కళింగ స్టేడియం భువనేశ్వర్ ఒడిస్సాలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు హరత సాధించి నట్లు డా.కె.భరత్ కుమార్ నాయక్ సోమ వారం తెలిపారు. ఇటీవల జరిగిన జూని యర్ గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో కథలుటిక్స్ రన్నింగ్ పోటీల్లో అరకు డిగ్రీ కళాశాలకు చెందిన శెట్టి లోహిత్, ఆగి పవన్ కుమార్, గోపాలకృష్ణ లాంగ్ జంప్ గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది. వీరిని ప్రిన్సిపల్ డా.భరత్ కుమార్ నాయక్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫోర్డ్ సించార్జి నాగబాబు, ఎన్ఎస్ఎస్ పిఓ విజయలక్ష్మి, అధ్యాపకులు అనితకుమారి, ఫిజికల్ డైరెక్టర్ అప్పారావు, అధ్యాపక బృందం అభినందించారు.

## వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

### - మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వి.ఆర్.పురం, అక్టోబర్ 21, ప్రభాతవార్త



వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళల అండగా ఉం టుందని, రంప చోడ వరం మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ నియోజక వర్గ నాయకురాలు నాగు లపల్లి ధనలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం ధనలక్ష్మి వి.ఆర్.పురం మండలంలో పర్యటిం చారు. ఇటీవల రేఖపల్లిలో గుండెపోటుకు గురై మరణించిన వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త, పట్టేల సీతయ్య ఇంటికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. సీతయ్య భార్య మంగమ్మ, కుమారుడు ప్రసాద్, కుమార్తె సంధ్యారాణిలకు ఆమె ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి బాధిత కుటుంబానికి పార్టీ ద్వారా కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, ఆ పార్టీ సీనియర్ నాయకులు మాచర్ల గంగయ్య, మండల ఉపాధ్యక్షులు చిక్కాల బాలకృష్ణ (బాలు), జె.సి.ఎస్ మండల కన్వీనర్ బొడ్డు సత్యనారాయణ, ముత్యాల గౌతమ్, మాచర్ల వెంగళరావు, చీమల కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

## నాతవరం మండలం పెద్ద గొలుగుండ పేటలో పల్లె పండుగలో పాల్గొన్న స్పీకర్



నర్సీపట్నం, అక్టోబర్ 21,ప్రభాతవార్త

నాతవరం మండలం పెద్ద గొలుగుండ పేట గ్రామంలో పల్లె పండుగ పంచాయతీ వారోత్స వాలు కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు పాల్గొన్నారు.నాతవరం మండలంలో రూ.కోటి 40 లక్షలతో చేపట్టి రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడారు.సర్సీపట్నం నియోజకవర్గానికి 100 రోజుల్లోనే రూ. 43 కోట్ల రూపాయలు తీసుకువచ్చాను. నాతవరం మండలానికి సుమారు 14 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగింది అని తెలిపారు.మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గానికి కోట్ల రూపాయలు తెచ్చినట్లు చెబుతున్నారు. కానీ, తాండవ గేటు మరమ్మతులకు రూ. 3 లక్షలు ఇవ్వలేకపోయారు. తాండవ గేటు మరమ్మతుల కోసం రూ. 5 లక్షలు ఇచ్చి పూర్తి వేయించడం జరిగింది. పంట సీజన్ ప్రారంభమైన వెంటనే కొత్త గేట్లు ఏర్పాటు చేయిస్తాం అని చెప్పారు.నాలుగు సంవత్సరాం తొమ్మిది నెలల సమయం ఉంది. ఈ కాలంలో నర్సీపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో పెట్టి చూపించే బాధ్యత నా మీద ఉంది అని అయ్యన్నపాత్రుడు అన్నారు.జగన్మోహన్ రెడ్డి వచ్చే అసెంబ్లీకి రావాలని ఆహ్వానిస్తున్నా ఇద్దరం కలిసి ముచ్చటించుకుందాం. తనకు నాకు నమస్కారం పెట్టాల్సి వస్తుందనే భయంతోనే అసెంబ్లీకి రావడం లేదు అని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో ఇసుక దోపిడీ చేసినవారు జగన్మోహన్ రెడ్డి తో పాటూ నియోజకవర్గంలో అయితే మాజీ ఎమ్మెలే అతని అనుచరులు,ఐదేళ్లు ప్రజలను మోసం చేసి రాష్ట్రాన్ని దోచుకున్నా వారు ఇవాళ ఇసుక గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది అని విమర్శించారు.గుమ్మడిగొండ, అల్లిపూడిలో అక్రమం ఇసుక తవ్వకాలు చేసి రూ. 2 కోట్లు దోచుకున్నారు. నర్సీపట్నంలో 48 వేల మెట్రిక్ టన్నుల అక్రమ ఇసుకను పట్టుకున్నాం. దీనికి మాజీ ఎమ్మెల్యే, ఆయన బీనామే కారణం. దీనికి రూ 18 కోట్ల ఫెనాల్టీ వేయించాం అని వివరించారు.ట్రాక్టర్ లేదా బండిపై ఇసుక తీసుకెళ్లినప్పుడు డబ్బులు వసూలు చేయొద్దని ప్రభుత్వం సూచించింది. రాజమండ్రి నుంచి వచ్చిన అసుక రవాణా చార్జీలు ఎలా ఉచితంగా ఇవ్వమంటారు? రాజమండ్రి అద్దె మీ బాబు ఇస్తారా? మీ తాత స్తాడా? నువ్వే కాదు, నీ బాస్ జగన్మోహన్ రెడ్డిని కూడా ప్రజలు పంపించేశారు. అని అన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేసే వారికే అవకాశం ఇస్తాం. తాళాలు కొట్టేవారికి అవకాశాలు లేవు అని చెప్పారు.చంద్రబాబు గారు పోలవరంపై తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ హామీ ఇచ్చారు. దానికి రూ. 2900 కోట్ల అంచనా ఉంది. రాబోయే రోజుల్లో దాన్ని పూర్తి చేసి, నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటాను అని పలికారు. నేను ప్రజలను మోసం చేయలేను అని పేర్కొన్నారు.గ్రామాలకు అన్ని విధాలుగా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాను . ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వీ వీ రమణ, నాతవరం మండల నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం విజయనగరం
వార్త
25 Glorious years

## దశపత్ర కషాయం అన్ని రకాల పురుగులు నివారణకు ఎంతో దోహదపడుతుంది



పాచిపెంట, అక్టోబర్ 21 ప్రభాతవార్త

దశపత్ర కషాయం అన్ని రకాల కాయ తొలుచు, ఆకుతినే పురుగుల నివారణకు ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారి అన్నారు. మండలంలో పొలవలస గ్రామంలో పెరటి కూరగాయ పంటలు ఎక్కువగా వేస్తున్నారని వీటికి రసాయనాలు కేవలం కషాయం ద్వారా తెగుళ్ళు నివారణ చేపట్టుకోవాలని సూచించారు. ఈ గ్రామ రైతులు ఎక్కువగా రసాయనాల తయారు చేసుకుని వాడుకోవాలని ఈ సందర్భంగా రైతులకు జిల్లేడు కషాయం తయారీ చేసి చూపించారు. ఎన్నో పోషకాలు ఉంటాయని మొక్క పెరుగుదలకు బాగా ఉపయోగపడుతుందని 10 రకాల ఆకులతో తయారు చేసిన దశ పత్ర కషాయం పురుగులను నివారించడమే కాకుండా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రకృతి సేద్య ఎల్.వన్ సురేష్ కుమార్‌తో కలిసి ప్రకృతి సేద్య పంటలను పరిశీలించారు.

## ఘనంగా అమవీరుల సంస్మరణ దినోత్సవం

పార్వతీపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త



సమాజ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ హాజరై నివాళులు అర్పించారు. అనంతరం రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీరాములు, పేరేడ్ కమాండర్‌గా పోలీసులు పరేడ్ నిర్వహించగా, అమరవీరులకు తుపాకుల విన్యాసంతో ఘనంగా నివాళులు అర్పించారు. అమరులైన పోలీసులను స్మరించుకుంటూ అమరవీరుల స్మృతి స్థూపం పుష్ప గుచ్చాలను ఉంచి విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరిస్తూ, కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశ భద్రతకు ప్రాణ త్యాగాలు చేసిన పోలీసు వీరులను స్మరించుకుంటూ ప్రతీ సంవత్సరం అక్టోబర్ 21న అమర వీరులు సంస్మరణ దినోత్సవం జరుపుకొంటున్నామన్నారు. శత్రు దేశాల నుంచి దేశాన్ని కాపాడే వారు వీర జవానులు అయితే దేశంలో శాంతి భద్రతలను రక్షించే బాధ్యత పోలీసు బలగాలు తీసుకుని దేశానికి విస్తృతమైన సేవలందిస్తున్నాయన్నారు. విధి నిర్వహణలో అనేక మంది పోలీసులు ప్రాణత్యాగం చేశారని ప్రాణాలు కోల్పోతున్న పోలీసుల సంఖ్య ప్రతి యేడాది పెరుగుతూనే ఉన్నప్పటికీ, పోలీసులు విధి నిర్వహణలో రాజీలేని పోరాటాలను జరిపి తీవ్రవాద చర్యలను ఎదురించడంలోను, శాంతి భద్రతల పరిరక్షణలోను కీలకమైన పాత్రను పోషిస్తూనే ఉన్నారన్నారు. ప్రజల రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీసులు నేడు భౌతికంగా మన మధ్య లేకున్నా పోలీసుశాఖకు వారు చేసిన సేవలు శ్లాఘనీయమని, వారి కుటుంబాలను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అమరులైన స్వర్గీయ బి.శ్రీరాములు సతీమణి ప్రమీల వారి కుటుంబ సభ్యులతో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే ఇతర అదికారులు మమేకమై వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని వారికి పండ్లు, నగదును అందజేసి వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్న భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డాక్టర్ ఓ దిలీప్ కిరణ్, పార్వతీపురం ఎఎస్పీ అంకిత సురాన, పాలకొండ డిఎస్పీ రాంబాబు, ఎ.ఆర్ డిఎస్పీ ఎస్.వి.అప్పారావు, ఎస్పీ సిఐ జి.డి బాబు, సిఐలు ఎస్.ఐలు ఆర్ఎస్ఐలు ఇతర పోలీసులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు త్యాగాల వలనే సమాజంలో స్వేచ్ఛగా జీవిస్తున్నాం : మంత్రి కొండపల్లి



విజయనగరం, అక్టోబర్ 21 ప్రభాతవార్త ప్రతినిధి :

పోలీసుల త్యాగాల వలనే సమాజంలో స్వేచ్ఛగా జీవిస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని స్మృతి వనంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిధిగా పాల్గొని అమర వీరుల స్మృతి స్థూపం వద్ద పోలీసు అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ఈ సంవత్సరం అమరులైన 216 మంది పోలీసుల వివరాలతో కూడిన పుస్తకాన్ని మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. విధులు నిర్వహిస్తూ తీవ్రవాదుల దాడుల్లో మృతి చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది పేర్లను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత చదివి వినిపించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా రక్షణలో పోలీసులు విధులను నిర్వహిస్తూ కొన్ని సార్లు ప్రాణాలను సైతం కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. అయినప్పటికీ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు తమ విధులను నిర్వహించడంలో వెనుకంజ వేయకపోవడాన్ని ప్రతీ ఒక్క పోలీసు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పోలీసు వ్యవస్థ సమర్థవంతంగా పని చేస్తేనే దేశంలో ప్రజలందరూ సుఖంగా ఉంటారన్నారు. పోలీసు అమర వీరుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఎప్పుడు ఏ అవసరమున్నా సహాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడటంలో భాగంగా పోలీసులు తమ రోజు వారి విధులను నిర్వహిస్తూ విధులను నిర్వహించే క్రమంలో ప్రాణాలను కోల్పోవడం దురదృష్టకరమైనప్పటికీ అన్ని వృత్తుల్లోకి పోలీసు ఉద్యోగానికి ప్రజల్లో ప్రత్యేకమైన గౌరవం ఉందన్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు రాగ ద్వేషాలకు అతీతంగా ఎంతో క్రమశిక్షణతో నిబద్దతతో సంయమనం పాటిస్తూ ఎండలోను, వానలోను విధులు నిర్వహిస్తున్నారన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి దిశ పోలీస్టేషన్ వరకు సిబ్బంది పోలీసు అమరవీరులను కీర్తిస్తూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎం.పి కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ పి.శ్రీనివాసరావు, డిటిసి డిఎస్పీ ఎం.వీరకుమార్, ఇంటిలిజెన్స్ అధికారి వెంకటనాయుడు తదితరులు కూడా పాల్గొన్నారు.

## పెదకాదలో పారిశుద్ధ్య పనులు



దత్తిరాజేరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

మండలంలోని పెదకాద గ్రామంలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరిగిందని గ్రామ ఉప సర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు అన్నారు. కాలువలో ఉన్న చెత్తను తీయించి కాలువలను పరిశుభ్రం చేశారు. కాలువలో దోమలు చేరకుండా మంద కొట్టించారు. తీసిన చెత్తను ట్రాక్టర్ ద్వారా చెత్త సంపద కేంద్రాలను తరలించారు.



## అయోడిన్ చాంపియన్స్ వీరే

రామభద్రపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నేషనల్ అయోడిన్ డెఫియన్సీ డిజారర్ కంట్రోల్ ప్రొగ్రాం పాఠశాలలో ఈ నెల 17 నుంచి 19వ తేదీలలో వ్యాసరచన పోటీలను నిర్వహించడమైంది. అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధులు వాటి పరిణామాలపై ఈ వ్యాసరచన నిర్వహించామని జిల్లా విద్యాశాఖధికారి తెలిపారు.

## విద్యకు నోచుకోని బొడ్డపాడు గ్రామ చిన్నారులు

సాలూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త




సాలూరు మండలం బొడ్డపాడు గ్రామంలో పిల్లల సంఖ్య తక్కువ ఉన్నదని పాఠశాలను మూయడం చాలా అన్యాయమని విద్యకు నోచుకోని చిన్నారులు పశువుల కాపరులుగా మారిపోతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం అద్యక్షుడు ఎస్.అప్పారావు సోమవారం ఉదయం ఆయన ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం వద్ద మూసివేసిన పాఠశాల తెరిపించాలని చిన్నారులు వారి తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. అప్పారావు మాట్లాడుతూ పాఠశాల ఉంటే చదువుకోవాలని చిన్నారులు ఎంతో ఆశతో ఉన్నారని వెంటనే పాఠశాల తెరిపించేందుకు ప్రభుత్వాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేపట్టి పోరాటం చేస్తామన్నారు. పంతల సుందర్రావు, గిమ్మల జానకిరావు, ఎస.తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎంను సత్కరించిన ఎమ్మెల్యే



శృంగవరపుకోట, అక్టోబర్ 21 ప్రభాతవార్త

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. సోమవారం జిల్లాలోని గుర్ల మండలంలో డయేరియా ప్రాంతాలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పవన్ కల్యాణ్‌ను కోళ్ళ కలిసి ఘనంగా ఆయనను సత్కరించారు. నియోజకవర్గంలో పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్ళినట్లు సమాచారం. మంత్రి శ్రీనివాసరావు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, విజయ నగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంబేద్కర్ పలు సంబందించిన శాఖాదికారులు కూడా పాల్గొన్నారు.

## బెస్ట్ స్కూల్ అవార్డుకు ఎంపికైన పోర్ట్‌సిటీ పాఠశాల




విజయనగరం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

న్యూఢిల్లీలో ఎడ్యుకేషన్ వరల్డ్ వారు ఇండియా స్కూల్ ర్యాంకింగ్స్ 2024-25 అవార్డులను ప్రకటించగా దీనిలో భాగంగా కో ఎడ్యుకేషన్ స్కూల్స్‌లో బెస్ట్ స్కూల్ అవార్డు విజయనగరం జిల్లాలో పోర్ట్‌సిటీ స్కూల్‌కు లభించింది. ఈ అవార్డు పోర్ట్‌సిటీ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రోయినాఖాన్ ఈ నెల 18వ తేదీన న్యూఢిల్లీలో అందుకున్నారు. పోర్ట్‌సిటీ పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు మాట్లాడుతూ ఎడ్యుకేషన్ వరల్డ్ వారు ఇచ్చే బెస్ట్‌స్కూల్ అవార్డుకు మా పోర్ట్‌సిటీ పాఠశాల ఎంపికవ్వడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. పోర్ట్‌సిటీ పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టర్ రోయినాఖాన్ డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ విద్యార్థుల తల్లిదండ్రులకు, పాఠశాల సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

## వేయింగ్ మిషన్ వితరణ

మెరకముడిదాం, అక్టోబర్ 21 ప్రభాతవార్త




మండలంలో కేజీబీవీ పాఠశాలకు బాలమిత్ర పౌండేషన్ హైదరాబాద్ వారు 9,500 రూపాయలు విలువ చేసే విద్యార్థులకు ఉపయోగకరమైనటువంటి వేయింగ్ మిషన్‌ను మండల విద్యాశాఖాధికారి టి.దర్మశ్రీ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా బాలమిత్ర పౌండేషన్ హైదరాబాద్ వారికి కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.కె.గౌస్య బేగం, స్టాప్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్పీ రెడ్డి శంకరరావు, కస్తూర్బా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గొర్రెలు మేకలలో నట్టల నివారణకు మందులు పంపిణీ



లక్కవరపుకోట, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

మండలంలో అన్ని గ్రామాలలో గల గొర్రెలు మేకలలో వ్యాప్తించే నట్టల నివారణకు ప్రత్యేక కార్యక్రమం ద్వారా మందులు పంపిణీ చేస్తున్నట్లు ఎల్ .కోట వెటర్నరీ డాక్టర్ కె.గాయ త్రి తెలిపారు. సోమవారం రంగారాయపురం గ్రామంలో 150 గొర్రెలు అలాగే 250 మేకలకు మందులు వేసినట్లు ఆమె తెలిపారు. ఈ పంపిణీని ఆయా గ్రామ సర్పంచ్‌ల చేతుల మీదుగా ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం అక్టోబర్ నెల చివరి వరకు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. మండలంలోని కిత్తన్నపేట గ్రామంలో గొర్రెలు మేకలు సంఖ్య ఎక్కువ ఉన్న కారణంగా ఆ గ్రామంలో నట్టల నివారణ కార్యక్రమం ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గొర్రెలు మేకల యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మందు వేయడమే వల్ల గొర్రెలు మేకలలో మరణాల సంఖ్య తగ్గించబడి పుట్టే పిల్లలు ఆరోగ్యంగా బరువుగా పుడతాయని మాంసం ఉన్ని దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కిత్తన్న పేట వెటర్నరీ అసిస్టెంట్ రాజు రంగారాయపురం అసిస్టెంట్ రఘు పాల్గొన్నారు. గ్రామ పెద్దలు కరెడ్ల అప్పన్న దొర గంగయ్య చిదంబరం తదితరులు పాల్గొన్నారు.

## గచ్చం చెట్టు వద్ద రెండు బైకులు డీ కొని ఒకరు మృతి

మెంటాడ, అక్టోబర్ 21 ప్రభాతవార్త



మెంటాడ మండలంలో ఆంద్ర ఎస్.ఐ సీతారాం తెలిపిన వివరాలు ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో గచ్చం చెట్టు వద్ద కొణిశ గ్రామానికి చెందిన చాకలిపేట వెంకట అప్పల నర్సింహరాజు (57) వ్యక్తిని కొణిశ గ్రామం నుంచి ఆగూరు గ్రామానికి వెళుతుండగా మెంటాడ గచ్చం చెట్టు వద్ద వచ్చేసరికి ఎదురుగా రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు ద్విచక్రవాహనంపై అత్యంత వేగంగా వచ్చి ఢీ కొనడటం జరిగిందన్నారు. అప్పలనర్సింహ రాజు తీవ్ర గాయాలతో మెంటాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆంద్ర ఎస్.ఐ తెలిపారు.

## ఆశ్రమ పాఠశాలలు ఆకస్మాత్తుగా తనిఖీ చేసిన న్యాయమూర్తి



కురుపాం అక్టోబర్ 21 ప్రభాతవార్త

ఆశ్రమ పాఠశాలలను ఆకస్మాత్తుగా కురుపాం మొదటి తరగతి న్యాయమూర్తి స్వామియా జ్యోస్ని తనిఖీ చేశారు. సోమవారం కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రుచికరమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు.

## రక్తహీనత నివారణకు చర్యలు

గరుగుబిల్లి, అక్టోబర్ 21 ప్రభాతవార్త



రక్తహీనత నివారణ చర్యల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం-2లో గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంపై అంగన్వాడీ వర్కర్లు పల్ల కృష్ణవేణి, మూడడ్ల స్వాతిలు అవగాహ కల్పించారు. ఈ మేరకు గర్భిణీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారంను విధిగా తీసుకోవాలని కోరారు. పౌష్టికాహార నిర్వాహణపై మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. గర్భిణీలు పౌష్టికాహారం కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని కోరారు. రక్తహీనత నివారణ తదితర అంశాలపై తగు సూచనలు సలహాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## సౌజన్యపై రాజకీయ వేదంపులు ఆపండి




గజపతినగరం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

మండలంలోని రామన్నపేట అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పని చేస్తున్న మానాపురం సౌజన్యపై రాజకీయ వేదింపులు తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీ హెల్పర్స్, వర్కర్స్ యూనియన్ సోమవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట దర్నా చేపట్టారు. జిల్లా అంగన్వాడీల సంఘం గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దర్నా నినాదాలతో హోరోత్తింది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ హెల్పర్ సౌజన్యను అకారణంగా తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఈ క్రమంలో స్థానిక సర్పంచ్ వేదింపులకు గురి చేస్తున్నారన్నారు. లేని పోని తప్పుడు కారణాలు చూపిస్తున్నారన్నారు ఈ ప్రయత్నాలు ఆపాలని, అ కారణంగా గొలగిస్తే తమ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఐసిడిఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఐసిడిఎస్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ, అంగన్వాడీల సంఘం ప్రాజెక్టు అద్యక్ష, కార్యదర్శులు ఎస్.సుబాషిని, పి.జ్యోతి, సంఘ నాయకులు పద్మ, సౌజన్య హెల్పర్స్ పాల్గొన్నారు.

## కెంగువలో డయేరియా

గజపతినగరం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



గ్రామంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు... మండలంలో కెంగువ గ్రామంలో డయేరియా ప్రబలింది. గ్రామానికి చెందిన ముగ్గురు అతిసారంతో గజపతినగరం ప్రభుత్వాసుపత్రిలో చేరారు. దీంతో అప్రమత్తమైన మరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సోమవారం గ్రామంలో వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ గ్రామానికి చెందిన ఎస్.అప్పలనాయుడు రెండు రోజుల క్రితం వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురికాగా, స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విజయనగరం కేంద్రాసుపత్రికి తరలించారు. ఆ తరువాత గ్రామంలో మరో ఇద్దరికి అతిసార వ్యాధి లక్షణాలు కనిపించడంతో గ్రామంలో భయాందోళనలు మొదలయ్యాయి. ప్రస్తుతం కెంగువ గ్రామానికి చెందిన పెరుమజ్జి సత్యం (35), సుంకరి సింహాచలం (53), రాములమ్మ (55) గజపతినగరం ఏరియా ఆసుత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ వరుస కేసులతో అప్రమత్తమైన వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి డయేరియా విజృంభించకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అలాగే మరో వైపు గ్రామంలో ఆర్‌డబ్లుఎస్ ఇంజనీరింగ్ అధికారులు తాగునీటి పట్ల ప్రత్యేక దృష్టి సారించారు. శాంపిల్స్ ను పరీక్షిస్తున్నారు.

## పెద పెంకి గ్రామంలో ఫైలేరియా అధికారి సందర్శన

బలిజిపేట, అక్టోబర్ 21 ప్రభాతవార్త



పెదపెంకి గ్రామంలో సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా ఫైలేరియా జిల్లా ప్రొగ్రామింగ్ అధికారి ఎం.వినోద్ గ్రామంలో సందర్శించి రోగులు దగ్గరికి వెళ్ళి వివరాలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం పై హారతిగా గ్రామంలో ప్రతి రోజు పారిశుద్ధ్య కార్యక్రమం జరగాలని తెలియజేశారు. అలాగే మంచినీటి సమస్య ప్రతి రోజూ తాగునీరు శుభ్రం చేయాలని సూచనలు ఇచ్చారు. ఫైలేరియా ఉన్న వారికి మందులు సక్రమంగా అందుతున్నాయో లేదా తెలుసుకున్నారు. ఈయన వెంట పిహెచ్‌సి డాక్టర్ కిరణ్మయి. ఎంపిడివో సర్పంచ్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం



### టిడిపి సీనియర్ నాయకుడు రవిశేఖర్

నెల్లిమర్ల, అక్టోబరు 21 ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజక వర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. మండలంలోని వల్లూరులో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించతలపెట్టిన సిసి రోడ్డు కు రవిశేఖర్ చేతుల మీదుగా సోమవారం శంకుస్థాపన, భూమి పూజ జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన వంద రోజులకే అభివృది పనులు ప్రారంబం కావడం గొప్ప విషయమని అన్నారు. రాష్ట్రంలో ఆర్దికంగా వెనుక బడి ఉన్నా అభివృద్ధిపై చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్‌కళ్యాణ్ చిత్తశుద్దితో పనిచేస్తున్నారని అన్నారు. అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. పల్లె పండుగలో భాగంగా ఈ శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సర్పంచ్ పంచాది జయలక్ష్మి, ఎంపీటీసీ లెంక నాగేశ్వరి, పార్టీ నాయకులు పంచాది జగన్నాధం, లెంక సన్యాసిరావు, పంచాది సూరినాయుడు, మొంగం శ్రీనివాసరావు పాల్గొన్నారు

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పారసాం విద్యార్థిని పూజిత ఎంపిక

నెల్లిమర్ల, అక్టోబరు 21 ప్రభాతవార్త :



మండలంలోని పారసాం ఉన్నత పాఠశాల విద్యార్థిని గవిడి పూజిత రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయుడు కె.సోమశేఖర్ తెలిపారు. జిల్లాలోని రఘుమండలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో పూజిత మంచి ప్రతిభ కనబరచడంతో ఆమె రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పూజితను, ఆమెకు తర్ఫీదునిచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఎస్.దమయంతిని హెచ్ఎం సోమశేఖర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు

## చోరీ నిందితుడు అరెస్టు




నెల్లిమర్ల, అక్టోబరు 21 ప్రభాతవార్త

మండలంలోని దేవుని నెలివాడ రాజరాజేశ్వరి ఆలయంలో ఈ నెల 14న జరిగిన చోరీ నిందితుడును గుర్తించి నెల్లిమర్ల పోలీసులు సోమవారం పట్టుకున్నారు. నిందితుడు శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం ఇజ్జాడ పాలెం గ్రామానికి చెందిన గౌరీప్రసాద్‌గా గుర్తించారు. అతని నుంచి పది గ్రాముల బరువు గల రెండు వెండి కిరీటాలు, 2500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. నిందితుడు గౌరీప్రసాద్ పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు

## కారు ఆపి...దివ్యాంగురాలి సమస్య విన్న డిప్యూటీ సీఎం

నెల్లిమర్ల, అక్టోబరు 21 ప్రభాతవార్త



మండల కేంద్రం గుర్లకు కాన్వాయ్‌గా వెళ్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్ సోమవారం మార్గమధ్యంలో నెల్లిమర్ల మిమ్స్ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న దివ్యాంగురాలు జి.రమాదేవిని చూసి ఆపి కారుదిగి ఆమె వద్దకు వెళ్లారు. ఆమె సమస్యను అడిగి తెలుసుకున్నారు. వినతి పత్రం స్వీకరించారు. తనకు దివ్యాంగురాలి పింఛను వస్తున్నా జీవనం కష్టంగా ఉందని, పింఛను సొమ్మును పెంపుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి పరిశీలిస్తానని భరోసా ఇచ్చారు.

## శంబంగికి పలువురు ప్రముఖుల పరామర్శ

బొబ్బిలి, అక్టోబర్ 21 ప్రభాతవార్త

బొబ్బిలి మండలం పక్కి గ్రామానికి చెందిన శంబంగి అమ్ములు (86) గత రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. సెంట్రల్ బ్యాంకు అధికారిగా పని చేసి పదవీ విరమణ చేసిన ఆమె భర్త గత ఏడాది మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. అమ్ములు విశాఖ డైయిరీ ప్రారంభం నుంచి డెరెక్టరుగా కొనసాగుతున్నారు. మృతి చెందిన అమ్ములు బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడుకి స్వయానా అన్న భార్య. ఆ కుటుంబాన్ని, గ్రామాన్ని ఆమె ఒక్క తాటిపై నడిపించి అందరిని ఉన్నతులుగా చేసిన వ్యక్తి అని గ్రామస్తులు చెబుతుంటారు. అమ్మగా ,వదినగా ,భార్యగా, గ్రామ పెద్దగా అన్నీ తానై నడిపించే శక్తి ఆమెకుందని గ్రామస్తులు అభివర్ణిస్తుంటారు. అమ్ములు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు సోమవారం బొబ్బిలి వచ్చారు. మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాసు, వైసీపీ విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వైసీపీ నాయకులు ఇంటి గోపాలరావు , కౌనిలర్లు, ప్రజా ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే శంబంగిని పరామర్శించారు. తమ సంతాపాన్ని తెలియచేశారు. అమ్ములు మరిది శంబంగి వేణు గోపాల నాయుడు ,కుమారులు శ్రీకాంత్ తదితరులతో కలిసి అమ్ములు పార్ధవ దేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. మధ్యాహ్నం గ్రామస్తులు అశ్రు నయనాల మధ్య అమ్ములు పార్ధివ దేహాన్ని ఊరేగించి దహన సంస్కారాలు నిర్వహించారు.

## ఘనంగా నందమ్మ సంబరాలు

మక్కువ, అక్టోబర్ 22 ప్రభాతవార్త



నందమ్మ సంబరాలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. గౌరీ పౌర్ణమి మొదలుకుని ఐదు రోజులు నందమ్మ సంబరాలు ప్రతి యేటా నిర్వహిస్తారు. ఈ నందమ్మ సంబరాలు శాతి వాహన సంఘం అద్యక్షుడు కొత్తూరు శంకరరావు అధ్యక్షతన నిర్వహించారు. నందమ్మ విగ్రహాలను శిల్పి అయిన పొట్నూరు శంకరరావు ఇంట్లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

శ్రీకాకుళం వార్త



## రహదారి సమస్యలు ఎన్నిసార్లు విన్నవించినా వినే నాథులే కరువాయే!



కొత్తూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

కొత్తూరు మండలం మారుమూల గ్రామం దిమిలి రహదారి దుస్థితి అత్యంత దయనీ యంగా ఉందన్న సంగతి అందరికీ తెల్సిందే. ఈ గ్రామం నుంచి బయట ప్రాంతాలకు వాహనాలపై వెళ్లాలన్నా, బయటి ప్రాంతాల నుంచి గ్రామానికి చేరుకోవాలన్నా నరకాన్ని చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్తులు మొర పెడుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంత మంది నేతలు మారుతున్నా గ్రామస్తుల సమస్యలు తీరడం లేదన్న విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. గ్రామం నుంచి ఎంతో మంది విద్యార్థులు రోజువారీ బయట పాఠశాలలకు వెళుతున్నా అధికారులకు గాని, నేతలకు గాని కనికరం కూడా లేదని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యార్థులు, ప్రయాణీకులు, ప్రయాణ సమయాల్లో పలు ప్రమాదాలకు గురౌతూనే ఉన్నా అధికారులకు, నేతలకు చీమ కుట్టినట్లు కూడా అనిపించకపోవడం శోచనీయమని గ్రామస్తులు తీవ్రంగా మండి పడుతున్నారు. ఇప్పటికైనా మా గ్రామ రహదారి పరిస్థితులను గమనించి అధికారులు, నేతలు స్పందించి తక్షణమే రహదారి పరిస్థితులను మెరుగుపర్చడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## గిరిజన సమస్యలకు తక్షణ చర్యలు చూపించకపోతే నిరసనలు తప్పవు

### -సీపీఎం నేతలు సిర్ల, నిమ్మకలు డిమాండ్

కొత్తూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త



గిరిజన సమస్యలకు తక్షణ చర్యలు చూపించకపోతే నిరసనలు తప్పవని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం కొత్తూరు మండలం గొట్టిపల్లి సచివాలయం పరిధిలో ఉన్న ఆదివాసీ గిరిజన గ్రామాల్లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, మండల నాయకులు నిమ్మక అప్పన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గొట్టిపల్లి కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వీరిరువురు మాట్లాడుతూ కొత్తూరు మండలం గొట్టిపల్లి పంచాయతీ గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, గొట్టిపల్లి, పుల్లలగూడ ఉమ్మడి గ్రామాల కేంద్రంగా ఉన్న స్మశాన వాటికకు రహదారి మరియు ప్రహరీతో పాటు ఇతర మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అలాగే అసంపూర్తిగా ఉన్న చినరాజపురం, పెదరాజపురం, రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వాధికారులను సూచించారు. అలాగే అడ్డంగి, గొట్టిపల్లి గ్రామాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపట్టాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా గిరిజన సమస్యలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపించాలని లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, మండల నాయకులు నిమ్మక అప్పన్న, పాలక పార్వతి, గేదెల ధర్మారావు, ఆరిక శివ, గొర్లె సరోజిని, పాలక శేషగిరి, కె.చంద్రమ్మ, పాలక రోహిణి తదితరులు పాల్గొన్నారు.

## 3500 జీవాలకు ఉచిత నట్టల నివారణ మందులు



కోటబొమ్మాళి, అక్టోబర్ 21 ప్రభాతవార్త

నట్టల నివారణ మందులను గొర్రెలు, మేకల పెంపకందారులు తమ పశువులకు వేయించుకోవాలని స్థానిక పశువైద్య సహాయ సంచాలకులు ఎం.లోకనాథం, పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్‌లు అన్నారు. సోమవారం మండలం పట్టుపురం, రామయ్యపేట, యలమంచిలి, కిష్టుపురం, సింహాద్రిపురం, పొన్నానపేట, సాలిపేట తదితర గ్రామాల్లో సుమారు 3500 గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరిగిందని, ఈ మందులు వాడటం వలన జీవాల బరువు పెరుగుతాయని దీంతో ఆదాయం పెరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు వెంకటరత్నం, లక్ష్మినరసమ్మ, ముకుందరావు, ధర్మారావు, శోభ, బాలమ్మ, రాంబాబు, గొర్రెల కాపర్లు పాల్గొన్నారు.

## మౌళిక సౌకర్యాల కల్పన ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

కవిటి, అక్టోబర్ 21 ప్రభాతవార్త



మౌళిక సౌకర్యాల కల్పన ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. సోమవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా కవిటి పంచాయతీలో పలు రోడ్లుకు శంకుస్థాపన చేశారు. ప్రతి గ్రామంలో త్రాగునీరు, రోడ్లు, విద్యుత్ ఏర్పాటు చేసే ఘనత చంద్రబాబుది, ఎన్డీఏ ప్రభుత్వానిదని అన్నారు. త్వరలో మారుమూల గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యాలు కల్పించనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త దాసరి రాజు, మాజీ జెడ్పీటీసీ బెందాళం రమేష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ ఆరంగి మధు, కొర్రాయి వాసుదేవ్, మణిచంద్రప్రకాష్, వజ్జ రంగారావు,, మాజీ జెడ్పీటీసీ పి.కృష్ణారావు, పలువురు అధికారులు, దేశం నేతలు పాల్గొన్నారు.

## పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

### ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి

ఆముదాలవలస, అక్టోబర్ 21 ప్రభాతవార్త



ప్రభుత్వ పాఠశాల విద్యకు గొడ్డలిపెట్టుగా ఉన్న 117 జీఓ రద్దుకు కూటమి ప్రభుత్వం ముందుకు రావడం దానిలో భాగంగా మొన్న 18వ తేదీన విజయవాడలో ఉపాధ్యాయ సంఘాలతో రాష్ట్ర విద్యాశాఖాధికారులు సమావేశం నిర్వహించి తమ అభిప్రాయాలు తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ 117 జీఓ రద్దుతో ప్రాథమిక పాఠశాలలు తిరిగి గాడిలో పడతాయని ఇది ప్రభుత్వ పాఠశాలలకు మంచి నిర్ణయం కానుందని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే అక్టోబర్ 16న జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగులకు రావల్సిన బకాయిలపై, బకాయిపడ్డ డీఏలపై కనీస చర్చ జరపకపోవడం మమ్మల్ని ఆవేదనకు గురి చేసిందని ఉద్యోగులకు గత ఆరు సంవత్సరాలుగా 25వేల కోట్లు వరకు బకాయిలు పడ్డారని ఇందులో గడచిన ప్రభుత్వమే 21,980 కోట్లు ఉద్యోగులకు బకాయిలు పెట్టినట్లు ప్రస్తుత ముఖ్యమంత్రి ఆర్థిక శ్వేత పత్రంలో తెలియజేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ఆ బకాయిలు విడుదల అవుతాయని ఉద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారని, ఒక ప్రక్క మీ భాగస్వామ్యంతోనే నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు డీఏ రూపంలో దసరా కానుక ఇచ్చిందని మరి ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగులు కనిపించడం లేదా? అని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడివలస నందు ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకుని దీపావళి కానుకగానైనా రావల్సిన బకాయిలపై డీఏ, ఐఆర్‌లపై ఒక ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తమ్మినాయుడు మాట్లాడుతూ 1,2 తరగతులు బోధించే ఎస్జీటీలకు ఇచ్చే ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ నాన్ రెసిడెన్షియల్లా ఉండాలని శిక్షణకు హాజరయ్యే వారిలో చిన్న పిల్లల తల్లులు, వివిధ రకాల అనారోగ్యంతో బాధ పడుతున్నవారు ఇంటి దగ్గర వీరి మీదే ఆధారపడ్డ వయోవృద్ధులైన కుటుంబ సభ్యులు ఉంటారని మరియు మహిళా ఉద్యోగుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని నాన్ రెసిడెన్షియల్ విధానంలోనే ఉపాధ్యాయుల ఇష్టం మేరకు శిక్షణ పూర్తి చేయాలని విద్యాశాఖాధికారులను కోరారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి పి.రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు, మిగతా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛ, సంక్షేమం కోసం ప్రాణాలను త్యాగం చేసిన ధైర్యవంతులకు నివాళులు

### ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం



శ్రీకాకుళం, అక్టోబర్ 21 ప్రభాతవార్త

ప్రజల కోసం పోరాడుతూ అమరులైన వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యత, మాతృభూమి శ్రేయస్సుకు పని చేసిన నిస్వార్ధ శ్రామికులు పోలీసులు అని రాష్ట్ర వ్యవసాయ సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డి, శాసనసభ్యులు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావులతో కలిసిపోలీసు అమరవీరుల స్థూపం వద్ద పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది నిర్వహించిన స్మృతి పరేడ్ ద్వారా అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ దేశం కోసం లడాక్‌లో తమ ప్రాణాలర్పించి అసువులు బాసిన అమరవీరులకు నివాళులు అర్పిస్తూ పోలీసుల అమరవీరుల దినోత్సవంగా ప్రతి సంవత్సరం ఈరోజు జరుపుకోవడం జరుగుతుందన్నారు. విధుల్లో చనిపోయిన పోలీసు కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. పోలీసులతో సమానంగా విధులు నిర్వహించిన హోంగార్డులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా కూడా మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ దేశ చరిత్రలో పోలీసు సంస్మరణ దినం విశిష్ట దినంగా భావిస్తున్నామన్నారు. పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. వారు చేసిన త్యాగాలు ఎవరూ ఎప్పటికీ మరువలేనివన్నారు. ఇలాంటి సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మేము విధి నిర్వహణే పరమావధిగా భావిస్తామన్నారు. దేశ వ్యాప్తంగా 216 మంది అమరులయ్యారని అందులో మన రాష్ట్రానికి చెందిన వారు ఇద్దరు ఉన్నారన్నారు. ప్రభుత్వం పోలీసులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ప్రజల్లో అభిమానం, గౌరవం పొందేలా ప్రతీ పోలీసు విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో ఐదుగురు పోలీసులు ఎస్.బంగారు నాయుడు, ఎ.పాపారావు, ఎం.నరేంద్రదాస్, ఎం.వెంకటరమణ, పి.కృష్ణమూర్తిలు ప్రత్యర్థి దాడుల్లో అమరులై ప్రాణాలు అర్పించారని తెలిపారు. వారి సేవలు గుర్తు చేసుకోవడం మన బాధ్యత అని వారికి ఘనంగా నివాళులు అర్పించి వారి త్యాగాలకు గుర్తుగా వారి కుటుంబాలకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డిఎస్పీలు వివేకానంద, రాజశేఖర్, శేషాద్రి, ప్రసాద్, అమరవీరుల కుటుంబ సభ్యులు, సీఐలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## అర్బన్ క్రూయిజర్ టైజర్ లిమిటెడ్ ఎడిషన్ విడుదల చేసిన టొయోటా కిర్లోస్కర్ మోటార్

టెక్కలి, అక్టోబర్ 21 ప్రభాతవార్త

టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈరోజు తమ అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్ అర్బన్ క్రూయిజర్ టైజర్ యొక్క లిమిటెడ్ ఎడిషన్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక ఎడిషన్, స్టైల్ ప్రీమియం నెస్‌ను మెరుగుపర్చడంపై దృష్టి సారించి రూపొందించబడిందని టొయోటా కిర్లోస్కర్ మోటార్ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ విభాగ ప్రతినిధి శబరి మనోహర్ తెలిపారు. కస్టమర్‌లకు మరింత ఆనందం ఇస్తూ ఈ పరిమిత ఎడిషన్ రూ.20160 విలువ కలిగిన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టిజిఏ) ప్యాకేజీతో వస్తుందన్నారు. అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను ఇటీవలే పరిచయం చేసిన తర్వాత అర్బన్ క్రూయిజర్ టైజర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



కంచిలి, అక్టోబర్ 21 ప్రభాతవార్త

కంచిలి మండలం మకరాంపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వజ్జ త్యాగ రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అలాగే అంపురం పంచాయతీ కొత్తఅంపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మద్ది ఆదినారాయణ మనవుడు మద్ది త్రినాథ్ (సునీల్) ఇటీవల ఆకస్మాత్తుగా చెరువులో పడి మృతి చెందారు. ఈ రెండు కుటుంబాల సభ్యులను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వజ్జ మృత్యుంజయరావు, జెసిఎస్ కన్వీనర్ కొనపల సురేష్ మాజీ ఎఎంసి చైర్మన్ లడ్డుకేశవపాత్రో, ప్రత్యేక ఆహ్వానితులు దుర్గాశి ధర్మారావు తదితర గ్రామ పెద్దలు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## భూసర్వే గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్ఛాపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:



ఈ నెల 22 నుంచి నవంబర్ 12 వరకు నిర్వహిస్తున్న భూముల రీసర్వే గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. తహశీల్దార్ ఎన్.వెంకటరావు ఎమ్మెల్యేకు షెడ్యూలు అందజేశారు. ముచ్చింద్ర, కేదారిపురం, మునిభద్ర, మండపల్లి, తేలుకుంచి, హరిపురం, బొడ్డఖాళి, బొడ్డబడ, అరకభద్ర, శాసనాం, టి.బరంపురం, మశాఖపురం, లొద్దపుట్టి, ధర్మపురం, పూర్ణాటకం, ఈదుపురం, భిర్లంగి, కేశుపురంలలో రీసర్వే పూర్తయ్యిందని చెప్పారు. జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పోలీసుల విధుల పట్ల విద్యార్థులకు అవగాహన అవసరం



ఇచ్ఛాపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

పోలీసుల విధుల పట్ల విద్యార్థులకు అవగాహన అవసరమని రూరల్ ఎస్సై ఈ.శ్రీనివాసరావు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక స్వర్ణభారతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. రిసెప్షన్ పోలీస్ రేడియో, ఎఫ్ఐఆర్ నమోదు, పోలీసుల విధులు, బాధ్యతలు, స్టేషన్ విధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ జగదీష్, ఎఎస్సై సోమేశ్వరరావు పాల్గొన్నారు.

## వచ్చే జూన్ నాటికి మూలపేట పోర్టు జాతికి అంకితం చేస్తాం

### కేంద్ర మంత్రి అచ్చెన్నాయుడు



సంతబొమ్మాళి, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలోని మూలపేట పోర్టును సోమవారం మంత్రి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలపేట పోర్టు పూర్తయితే ఈ ప్రాంతం పారిశ్రామిక వాడగా మారుతుందన్నారు. ఈ పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలు రానున్నాయని తద్వారా ఈ ప్రాంతం పారిశ్రామిక హబ్ం మారనుందని మంత్రి తెలిపారు. అలాగే ఈ ప్రాంతం పర్యాటక రంగంగా కూడా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సాల్ట్ ల్యాండ్స్ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపినట్లు చెప్పారు. ఈస్ట్‌కోస్ట్, కేంద్ర ప్రభుత్వం, ఏపీఐఐసీ భూములు కలిపి ఎనిమిది వేల ఎకరాల భూమి అందుబాటులో ఉందన్నారు. ఆయిల్ రిఫైనరీని ఏర్పాటుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలిసి ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతమని, జిల్లాకు ఒక ఆయిల్ రిఫైనరీని కేటాయించామని కోరినటుల తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేసి విశాఖపట్నం నుంచి భోగాపురం నుంచి మూలపేటకు ఆరు లైన్ల రోడ్డు నిర్మించి మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టును భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసందానం చేస్తామని స్పష్టం చేశారు. రహదారులు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం పారిశ్రామికంగా, పర్యాటకంగాను, టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందుతుందని, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, ఉపాధి కోసం వలసలు నివారించవచ్చన్నారు. మూలపేట పోర్టు వలన కూడా ఉపాధి అవకాశాలు ఉంటాయని, పర్యాటక ప్రాజెక్టులు వస్తే ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. జిల్లాలో ఉన్న మత్స్యకారులు వలసలు పోకుండా ఫిషింగ్ హార్బర్, ఫిష్ లాండింగ్ సెంట్రల్‌లు ఏర్పాటు చేసి వలసలు నివారించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డితో కలిసి పోర్టు పనులను మంత్రి పరిశీలించారు.



## జిల్లాలో 213 నీటి వినియోగదారుల సంఘాలు 1560 ప్రాదేశిక ప్రాంతాలుగా విభజన

### జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్



వీరఘట్టం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

జిల్లాలో 213 నీటి వినియోగదారుల సంఘాలు, 1560 ప్రాదేశిక ప్రాంతాలుగా విభజించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని సాగునీటి వనరుల కింద ఉన్నటువంటి సాగునీటి సంఘాలకు నవంబర్ 21 నుంచి 29వ తేదీ వరకు వివిధ దశల్లో ఎన్నికలు నిర్వహించుటకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలోని సాగునీటి వనరుల వివరాలను జిల్లా గెజిట్ నెం.33/2024 ద్వారా ప్రచురించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో పెద్దతరహా నీటి పారుదల వనరులు కింద తోటపల్లి జలాశయం వస్తుందని, ఇందులో నీటి వినియోగదారుల సంఘాలు 22, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 4, ప్రాజెక్ట్ కమిటీ ఒకటి ఉన్నట్లు చెప్పారు. మధ్యతరహా నీటి పారుదలలో భాగంగా నీటి వినియోగదారుల సంఘాలు 25, ప్రాజెక్ట్ కమిటీలు 4, చిన్న నీటి పారుదల వనరుల్లో భాగంగా నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నట్లు తెలిపారు. దీన్ని 1560 ప్రాదేశిక ప్రాంతాలుగా విభజించినట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

## 24న శ్రీముఖలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు



జలుమూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖ లింగేశ్వరస్వామి దేవస్థానంలో నెలకొల్పబడిన ధర్మ హుండీలను ఈ నెల 24 గురువారం ఉదయం 10 గంటలకు లెక్కింపబడునని ఆలయ ఈఓ ప్రభాకరరావు పేర్కొన్నారు. దేవాదాయశాఖ తనిఖీదారు, శ్రీకాకుళం వారి పర్యవేక్షణలో, గ్రామస్తులు, భక్తుల సమక్షంలో లెక్కింపు చేయుటకు నిర్ణయించినట్లు ఈఓ తెలిపారు.

## రహదారుల పనులను త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే



జలుమూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త

15 రోజులలో నియోజకవర్గంలో చేపట్టిన రహదారి పనులను వెంటనే గుత్తేదారులు పూర్తి చేయాలని పోలాకిలో మీడియాతో సోమవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న పనులను పూర్తి చేయవలెనని పేర్కొన్నారు. రహదారులు పనులు వేగవంతంగా చేయని పక్షంలో గుత్తేదారులు బిల్లులు నిలిపివేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## డంపింగ్‌యార్డ్ మాదిరిగా మారిన కొండంపేట రహదారి



రాజాం, అక్టోబర్ 21 ప్రభాతవార్త

రాజాం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కొండంపేట వెళ్లే మార్గంలో డంపింగ్‌యార్డ్ తలపించినట్లుగా వ్యర్థాలను వదిలివేయడంతో చుట్టుప్రక్కల ప్రాంతమంతా దుర్వాసన వాటిల్లుతుందని స్థానికులు చాలా ఇబ్బందులకు గురౌతున్నామని తెలిపారు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి సేకరించిన వ్యర్థాలను ఆ మార్గంలో డంపింగ్ చేయడంతో ఈ విధంగా దుర్వాసన వస్తుందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న వ్యర్థాలను తక్షణమే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఓంశాంతి మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



మెళియాపుట్టి, అక్టోబర్ 21 ప్రభాతవార్త

మెళియాపుట్టి మండలంలో చాపర గ్రామంలో ఓంశాంతి మందిరంలో విశ్వశాంతి కోసం ప్రత్యేకంగా యోగా ప్రయోగం, యోగ విధానం గూర్చి జీవితం చక్క దిద్దుకునే విషయంలో మరింత శక్తిని పొందుటకై అనేక విషయాల గురించి బెంగుళూరు నుంచి వచ్చిన మంజునాధ అన్నయ్య పరివారం అనేక విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఓంశాంతి అక్కయ్యలు, అన్నయ్యలు మరియు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

## ఇదీ..! మండలంలోని దిమిలి రహదారి మార్గం దుస్థితి



కొత్తూరు, అక్టోబర్ 21, ప్రభాతవార్త

కొత్తూరు మండలం మారుమూల గ్రామం దిమిలి రహదారి దుస్థితి అత్యంత దయనీయంగా ఉందన్న సంగతి అందరికీ తెల్సిందే. ఈ గ్రామం నుంచి బయట ప్రాంతాలకు వాహనాలపై వెళ్లాలన్నా, బటయటి ప్రాంతాల నుంచి గ్రామానికి చేరుకోవాలన్నా నరకాన్ని చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని గ్రామస్తులు మొర పెడుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంత మంది నేతలు మారుతున్నా గ్రామస్తుల సమస్యలు తీరడం లేదన్న విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. గ్రామం నుంచి ఎంతో మంది విద్యార్థులు రోజువారీ బయట పాఠశాలలకు వెళు తున్నా అధికారులకు గాని, నేతలకు గాని కనికరం కూడా లేదని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యార్థులు, ప్రయాణీకులు, ప్రయాణ సమయాల్లో పలు ప్రమాదాలకు గురౌతూనే ఉన్నా అధికారులకు, నేతలకు చీమ కుట్టినట్లు కూడా అనిపించకపోవడం శోచనీయమని గ్రామస్తులు తీవ్రంగా మండి పడుతున్నారు. ఇప్పటికైనా మా గ్రామ రహదారి పరిస్థితులను గమనించి అధికారులు, నేతలు స్పందించి తక్షణమే రహదారి పరిస్థితులను మెరుగుపర్చడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

